# గన్ అండ్ యూనిఫామ్

"ఈరోజు అమృతరావు వచ్చాడా?" అడిగాడు అప్పుడే వచ్చిన రాఘవరావు తన ఎదురుగా కూర్చొని తర్వాతి క్లాసుకెళ్లడానికి ప్రిపేరవుతున్న లెక్చరర్ ప్రతాపరెడ్డిని.

"వచ్చి క్లాసుకెళ్ళాడు... క్లాసు నుండి బయటకొచ్చేటప్పటికి పాపం అతని పరిస్థితి ఎలా ఉంటుందో యేమో?" అన్నాడు ప్రతాపరెడ్డి.

వాళ్ళిద్దరూ ఆ కాలేజిలోని కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"క్లాసుకెళ్ళే ముందు బాగా ప్రిపేరవుతాడు. పేజీలకు పేజీల నోట్స్ రాసుకుంటాడు... కానీ క్లాసుకెళ్ళి స్టూడెంట్స్‌ని మాత్రం తృప్తిపరచలేడు. ఈయన క్లాసుకెళ్ళి పాఠం మొదలు పెట్టగానే పిల్లలు అల్లరి చేయటం మొదలుపెడ్తారు... వాళ్లు ఎంత అల్లరి చేస్తున్నా పట్టించుకోకుండా గంట మోగేంత వరకు ఈయన పాఠం చెబుతూనే ఉంటాడు. వాళ్లనెలా కంట్రోల్ చెయ్యాలో ఈయనకు తెలియదు. క్లాసులోంచి బయటకొచ్చి తనెంతో ప్రిపేరై, ఎంతో బాగా చెబుతున్నా వాళ్ళు వినటం లేదని చాలా బాధపడిపోతాడు. చాలా మంచి వ్యక్తి... బోల్డు నాలెడ్జి ఉంది... వెరీ.. వెరీ.. హార్డ్ వర్కర్... అయినా లెక్చరర్‌గా రాణించలేకపోతున్నాడు. అతన్ని చూస్తే జాలేస్తుంది" అన్నాడు రాఘవరావు.

"నిజమే... అతడు మరీ ఎక్కువగా ప్రిపేర్ కావటమే అతని సమస్యేమోననిపిస్తుంది. అన్ని పుస్తకాలు చదవటం, అన్ని పాయింట్స్ రాసుకోవటం ఎవడిక్కావాలండి? కాసేపు వాళ్లకిష్టమైన కబుర్లు చెప్పి, నాల్గు జోక్స్ చెప్పి ఎంటర్‌టైన్ చేసి రావాలి తప్ప పుస్తకాల్లో ఉన్న నాలెడ్జినంతా వాళ్ల బుర్రల్లోకి ఎక్కించాలంటే ఎలా సాధ్యమౌతుంది?... మనం చెప్పింది విని వాళ్లు పరీక్షల్లో రాస్తారా? పరీక్షలు పది రోజులున్నాయనగా గైడ్స్ చదివి పరీక్షలు రాస్తారని పూర్‌ఫెల్లో అమృతరావుకు తెలియదు" అన్నాడు ప్రతాపరెడ్డి.

వాళ్లిద్దరలా మాట్లాడుకుంటుండగానే బెల్ మోగింది. ఓ చేతిలో డస్టర్, ఓ చేతిలో అటెండెన్స్ రిజిస్టర్ పట్టుకుని మొఖం మీద చెమటలు కారుతోంటే హడావుడిగా అమృతరావు స్టాఫ్‌రూంలోకి ప్రవేశించాడు. అతని వెంటే ఇద్దరు విద్యార్థులు కూడా వచ్చారు. రిజిస్టర్‌ను, డస్టర్‌ను టేబుల్ మీద పెట్టి స్టాఫ్‌రూంలో ఉన్న వాష్‌బేసిన్ దగ్గరకెళ్లి చేతులకంటిన చాక్‌పీస్ పొడిని కడిగేసుకొని అతనివెంటే లోపలకొచ్చిన ఆ ఇద్దరు విద్యార్థులకేసి ఏం కావాలన్నట్టుగా చూశాడు.

"అటెండెన్స్ సార్!" అన్నారు వాళ్ళిద్దరు.

"మీరిద్దరూ నా క్లాసు ఇంకో ఐదు నిమిషాలకు అయిపోతుందనగా వచ్చారు. మీకు నేను ఆల్‌రెడీ ఆబ్సెంట్ మార్క్ చేశాను..." అన్నాడు అమృతరావు.

"ప్లీజ్ సర్! మాకు అటెండెన్స్ ఇవ్వండి సార్! నిన్నకూడా మీరు మాకు ఆబ్సెంట్ మార్క్‌చేశారు...." అన్నాడు ఆ ఇద్దర్లో ఒకతను... అతని పేరు సురేష్.

"మీరు క్లాసుకు రారు... వచ్చినా నేను చెప్పే పాఠం వినరు... బయటకు వెళ్ళిపోయి గోల చేస్తుంటారు... నేను మీకు అటెండెన్స్ ఇవ్వను..." ఖచ్చితంగా చెప్పేశాడు అమృతరావు.

"ఇవ్వరా సార్... ఎలా ఇవ్వరో మేమూ చూస్తాం..." అంటూ వాళ్లిద్దరు విసురుగా బయటకెళ్ళిపోయి వరండాలో ఇంకో ఐదారుగురు విద్యార్థులతో కలిసి...

"అమృతరావు... డౌన్... డౌన్... అమృతరావు.... డౌన్...డౌన్... పాఠాలు సరిగా చెప్పడం చేతకాని అమృతరావును వెంటనే డిస్‌మిస్ చెయ్యాలి"అని అరవటం మొదలెట్టారు.

వాళ్లలా కాసేపు అరచి తర్వాతి పీరియడ్ తీసుకునే లెక్చరర్ రాగానే క్లాసులోకెళ్ళి కూర్చున్నారు.

"ఛీ... ఛీ! నేనీ ఉద్యోగం ఇక చెయ్యలేనండి" అన్నాడు అమృతరావు తన సీట్లో కూర్చొని తలకిందకు వాల్చి చాలా బాధగా.

"మీకు కొంత లౌక్యం అవసరం అమృతరావు గారు" అన్నాడు రాఘవరావు.

"వాళ్ళు అటెండెన్స్ కోసం వచ్చారు... ఇచ్చేయండి... ఇవాళ యే కాలేజీలో కూడా అటెండెన్స్ తక్కువగా వుందని విద్యార్థుల్ని పరీక్షలకు వెళ్లకుండా ఆపడంలేదు. అలాంటప్పుడు మీరు అటెండెన్స్ విషయంలో అంత స్ట్రిక్టుగా ఉండాల్సిన అవసరంలేదు" అన్నాడు రాఘవరావు.

"మరి మన ప్రిన్సిపలేమో అటెండెన్స్ విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉండండి అని స్టాఫ్ మీటింగ్‌లో చెబుతాడేమిటి?" అన్నాడు అమృతరావు.

"ఆయన అలాగే చెబుతాడు. ఈ చెవితో విని, ఆ చెవితో వదిలిపెట్టండి... మరో విషయం... మీరు మరీ అంత ఎక్కువగా పెద్ద పెద్ద టెక్స్ట్‌బుక్స్ చదివి ప్రిపేరయి క్లాసుకెళ్ళి అదంతా వాళ్ళ బుర్రల్లోకి ఎక్కించాలని ప్రయత్నించకండి... మీరు చెప్పేదేదీ వాళ్ళ బుర్రల్లోకి ఎక్కదు... పాఠమొక్కటే కాదు... వేరే విషయాలు కూడా చెప్పండి... సినిమాలు, పాలిటిక్స్, ప్రేమ కథలు... ఇలాంటి వాటిని మీరు చెప్పే పాఠాల్లో మిక్స్ చేసి వాళ్ళను నవ్విస్తూ చెప్పండి" అన్నాడు రాఘవరావు.

"యేమిటోనండి... ఈ టీచింగ్ జాబ్‌కెందుకొచ్చానా అని రోజూ తలపట్టుకుంటున్నాను.. నాకీ జాబ్ వదిలేసి వెళ్ళిపోయి యే బస్‌స్టేషన్లోనో కూలీ పని చేసుకుంటూ బతకటం బెటరనిపిస్తోంది" అన్నాడు అమృతరావు.

"ఇంత మంచి జాబ్... నెలకు 25 వేల జీతం... బోల్డు సెలవులు... రోజూ ఓ రెండు క్లాసులు తీసుకుంటే చాలు... ఇంత రాయల్ జాబ్ మరొకటి ఉండదు... ఈ జాబ్‌ను వదిలేస్తానని మీరు మరోసారి అనకూడదు" అన్నాడు రాఘవరావు.

"మనశ్శాంతి... జాబ్ సాటిస్‌ఫాక్షన్ లేనప్పుడు ఎన్ని సౌకర్యాలుంటే యేమిటండీ" అన్నాడు అమృతరావు. అలా ఆరోజు గడిచిపోయింది.

అమృతరావుకు రెండో రోజు కూడా ఇదే పరిస్థితి... క్లాసులో పిల్లలు గోల చెయ్యడం... బయటకొచ్చాక అటెండెన్స్ ఇవ్వడం లేదని గోల చెయ్యడం... ప్రిన్స్‌పాలొచ్చి "యేమిటీ అల్లరని" "మీకసలు మీ స్టూడెంట్స్‌ని అదుపులో పెట్టుకోవడం చేతకాదని" అమృతరావునే కోప్పడటం జరిగింది.

అమృతరావు ఎంతో కష్టపడి సర్వీసు కమీషన్ పరీక్ష రాసి ఈ ఉద్యోగాన్ని సంపాదించాడు. కానీ ఉద్యోగంలో చేరిన మరుక్షణం నుండి అతనికి మనశ్శాంతి కరువైంది.

కొన్నిరోజులు తర్వాత పరీక్షలు దగ్గరపడ్డాయి... అటెండెన్స్ షార్టేజని ఆ కాలేజి ప్రిన్స్‌పాల్ కొంతమంది విద్యార్థుల్ని యూనివర్సిటీ పరీక్షలకు పంపించడం లేదని, 500 రూ. పెనాల్టీ చెల్లించి, డాక్టర్ దగ్గర నుంచి కొన్ని రోజులు జబ్బుపడ్డట్టుగా సర్టిఫికేట్ తెస్తే తప్ప ఈ విద్యార్థుల్ని పరీక్షలకు పంపించేది లేదని నోటీసు పంపించాడు.

మీ ఒక్కరి కారణంగానే మాకు అటెండెన్స్ తక్కువైందని కొందరు విద్యార్థులు అమృతరావు దగ్గరకొచ్చారు. నోటికొచ్చినట్టుగా అసభ్యమైన పదజాలంతో అతన్ని తిట్టారు. ఇద్దరు విద్యార్థులు వెళ్ళి అమృతరావు కాలర్ పట్టుకొని కొట్టే ప్రయత్నం కూడాచేశారు.

రాఘవరావు, ప్రతాపరెడ్డిలాంటి సీనియర్ లెక్చరర్లు జోక్యం చేసుకొని ఆ విద్యార్థుల్ని స్టాఫ్ రూం నుండి పంపించేశారు. ఇది జరిగిన మర్నాడే అమృతరావు లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తన స్వంత వూరుకు వెళ్ళిపోయాడు. ఇంత మంచి జాబ్ వదిలేసి వెళ్ళాడని అతని కొలీగ్స్ బాధపడ్డారు.

*　　*　　*

మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. రాఘవరావు యేదో పనిమీద హైదరాబాద్ వెళ్ళాడు.

అంతకుముందు రోజే హైదరాబాద్ నగరంలోని లుంబినీ పార్క్‌లో ఎవరో దుండగులు పెట్టిన బాంబులు పేలి ముప్ఫయి మంది దాకా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. దాంతో నగరంలో ఎక్కడ చూసినా పోలీసులే కనిపించారు.

"ఎందుకైనా మంచిది... త్వరగా హిమాయత్ నగర్‌లో ఉన్న తన స్నేహితుడింటికి చేరుకుందామనుకొని రాఘవరావు లిబర్టీ సెంటర్ దగ్గర సిటీ బస్సు దిగి తన స్నేహితుని ఇంటివైపు నడుస్తున్నాడు. కొంచెం దూరం వెళ్ళగానే అతనికో పోలీసు వ్యాన్ కనిపించింది. దాంట్లోంచి చకచకా ఓ పోలీసాఫీసర్ దిగి అక్కడున్న పోలీసులకు యేవో ఆర్డర్స్ ఇస్తున్నాడు. ఆ పోలీసు ఆఫీసర్‌ని చూడగానే రాఘవరావుకు అతన్ని ఇదివరకెక్కడో చూశానే! అన్న అనుమానం కల్గింది. కొన్ని క్షణాల సేపు అతన్నే చూస్తూ ఉండిపోయాడు. ఆ పోలీసు ఆఫీసర్ దృష్టి కూడా రాఘవరావు మీద పడింది.

"హల్లో రాఘవరావు గారూ!" అంటూ ఆ పోలీసాఫీసర్ రాఘవరావు నిల్చున్న చోటికి వేగంగా నడుస్తూ వచ్చేశాడు.

"నన్ను గుర్తుపట్టలేదా రాఘవరావుగారూ! నేను అమృతరావుని... మీ కాలేజిలో కొంతకాలం లెక్చరర్‌గా పనిచేయలేదూ?" అన్నాడా పోలీసాఫీసర్.

''ఓ మైగాడ్! నువ్వు అమృతరావువే!... సారీ! వెంటనే గుర్తుపట్టలేకపోయాను...!" అన్నాడు రాఘవరావు అతనితో షేక్‌హ్యాండ్ చేస్తూ.

"యూనిఫామ్‌లో ఉన్నాను గదా! గుర్తుపట్టడం కొంచెం కష్టమేలెండి" అన్నాడు అమృతరావు.

"అవునూ? నువ్వు పోలీసాఫీసర్‌వి ఎప్పుడయ్యావు?" అన్నాడు రాఘవరావు.

"కొంతకాలం ఆ దరిద్రపు లెక్చరర్‌గిరి వెలగబెట్టాను గదా... ఆ జాబ్ నా ప్రాణాలు తోడేసిందనుకోండి. ఎన్నోసార్లు నా కళ్ళకు నీళ్ళురావడం మీరు చూశారు గదా... ఇక నేనీ జాబ్ చెయ్యలేనని నిర్ణయించుకొని, మీరందరూ వద్దని వారిస్తున్నా వినకుండా రాజీనామా చేసేసి మా ఊరు వెళ్ళిపోయాను గదా... అప్పట్నుంచి వేరే యేదైనా మంచి జాబ్ సంపాదించాలని గ్రూప్ వన్ పబ్లిక్ సర్వీసు కమీషన్ పరీక్షలు రెండుసార్లు రాశాను. మొదటిసారి ప్రలిమ్స్ పాసయ్యాను కానీ ఫైనల్లో పోయాను. రెండోసారి ప్రిలిమ్స్‌లోనూ, ఫైనల్లోనూ గట్టెక్కి... ఇదిగో ఈ డిఎస్పీ జాబ్ సంపాదించాను" అన్నాడు అమృతరావు చాలా గర్వంగా ఫీలవుతూ.

"కంగ్రాచ్యులేషన్స్ డియర్ అమృతరావు! హార్టీ కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు రాఘవరావు మరోసారి అతనితో షేక్‌హాండ్ చేస్తూ.

"థాంక్యూ సర్!" అన్నాడు అమృతరావు.

"నీకీ జాబ్ నచ్చిందా?" అన్నాడు రాఘవరావు.

"నచ్చింది సార్! నేనిప్పుడు హ్యాపీగా ఉన్నాను"

"నిజంగా...! అయితే నేనో ప్రశ్న అడుగుతాను... యేమీ అనుకోవుగా..."

"అడగండి సార్! మీరంటే నాకు చాలా గౌరవం... యేమీ అనుకోను"

"నువ్వారోజుల్లో ఒక క్లాసులో ఉండే 40 మంది స్టూడెంట్స్‌నే కంట్రోల్ చెయ్యలేక బాధపడ్తుండేవాడివి. ఇప్పుడింత పెద్ద సిటీని... కొన్ని లక్షల మందిని ఎలా కంట్రోల్ చెయ్యగల్గుతున్నావు అమృతరావు?"

అతని ప్రశ్న విని అమృతరావు నవ్వాడు.

"వెరీ సింపుల్ సర్... అప్పుడు నా చేతిలో ఓ టెక్స్ట్‌బుక్, ఓ డస్టర్, ఓ అటెండెన్స్ రిజిస్టర్ మాత్రమే ఉండేవి... కానీ ఇప్పుడు చూడండి. నా వొంటిమీద ఈ యూనిఫామ్... నా చేతిలో ఈ గన్... నా చుట్టూ ఈ పోలీసుబలగం ఉన్నాయి. చేతిలో గన్, వొంటిమీద ఈ యూనిఫామ్ ఉన్నంతసేపు ఈ సిటీకే కాదు సార్... ఈ దేశాన్ని కూడా కంట్రోల్ చెయ్యవచ్చు... ఇట్స్ పవర్ సార్... పవర్... పోలీసులంటే పవర్. స్టేట్ పవర్! స్టేట్ పవర్ ముందు అన్నీ బలాదూరే..." అన్నాడు అమృతరావు.

"నిజమే..."

"టీచింగ్ అనేదొక కళ సార్... అది అందరికీ సాధ్యం కాదు... అది మీలాంటి కొద్దిమందికే సాధ్యం. ఇప్పుడు నేను చేస్తున్న పనిని ఈ యూనిఫామ్ వేసుకొని, చేతిలో ఈ గన్ పట్టుకున్న ఓ సగటు మనిషి ఎవడైనా చెయ్యగలడు.

"మేబీ యూ ఆర్ రైట్" అన్నాడు రాఘవరావు అమృతరావుకు 'బై' చెబుతూ

"మీరు ఎక్కడిదాకా వెళ్ళాలి సార్! నా వెహికిల్‌లో డ్రాప్ చెయ్యనా?"

"అక్కర్లేదు అమృతరావు... మా ఫ్రెండిల్లు ఇక్కడికి చాలా దగ్గర... నేను వెళ్తాను"

"సిటీలో పరిస్థితి బాగా లేదుసార్. మీ పని చేసుకొని త్వరగా మీ కరీంనగర్ వెళ్ళిపోండి సార్"

"అలాగే... ఆల్‌ది బెస్ట్ అమృతరావు" అంటూ రాఘవరావు అతనితో మరోసారి చేతులు కలిపి తను వెళ్ళాల్సిన చోటికి వెళ్ళిపోయాడు అమృతరావును గూర్చి ఆలోచిస్తూ.

"అవును... ఇట్స్ పవర్! స్టేట్ పవర్ దేన్నైనా సాధించగలదు" అనుకున్నాడు రాఘవరావు.